

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 | డిసెంబర్, 2015 | సంచిక : 7

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
**Ph : 9440413455, 9848133565**
Website : www.saidhamam.org
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com


**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
గురుదేవులతో కబుర్లు .......... 4
నారాయణ మోతీరాం జాని .......... 6
శ్రీగురుదేవుల ఆశీస్సులందుగాక 10
సత్యం విశ్వజనీనం .......... 11
కబీరు అమృతవాక్కులు .......... 14
హెచ్చరిక .......... 15
శ్రీ గజానన విజయం .......... 16
షిరిడీ డైరీ .......... 19
జగద్గురు తత్త్వబోధకస్వామి ...... 21
మాతృసంస్థ కబుర్లు .......... 25
సాయినాథాయ తేనమః .......... 32












ప్రియ మిత్రులారా,

మనమందరం ఏదో ఒక స్థాయిలో సాధకులమే. సాధనకు సహకరించే వాటిలో ఒక ముఖ్యమైన ఉపకరణం మౌనం. శ్రీ సాయి నాథుల వారు వేపచెట్టు క్రింద తపస్సు చేసారు. ఎవరితోనూ మాట్లాడేవారు కారనీ, పెడితే తినేవారు-లేకుంటే అడిగేవారు కారనీ చదువుకున్నాం. రమణమహర్షుల వారు 'మౌనస్వామి' అని పిలవబడ్డారంటే వారి మౌనం ఏ స్థాయిలో ఉండేదో తెలుస్తుంది. శ్రీ అరవిందులు, మెహర్‌బాబా మొదలైన వారు దశాబ్దాల తరబడి మౌనసాధన చేయటం మనం విన్నదే. గురుదేవులు శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీ వారు ఇంత పెద్ద ఆశ్రమంలో ఎన్నో సేవా కార్యక్రమాల మధ్య కూడా హఠాత్తుగా రెండు, మూడు, నాలుగు .... అలా రోజుల తరబడి మౌనంగా ఉండిపోయేవారు. మౌనం అంటే కేవలం వాచామౌనం చాలునా? అసలెందుకు?

మాటకు కావలసింది ప్రాణశక్తి. ప్రాణం అంటే వాయువు. వాయు తత్త్వం గల మనసును కొంతవరకు ఆపడానికి మౌనం సహకరిస్తుంది. శారీరక ఆరోగ్యానికి కూడా ఇది సహకరిస్తుంది. వీటన్నిటినీ మించి పరిసరాలలోని వ్యక్తులతో బంధం తగ్గిపోయే అవకాశం బాగా మెరుగవుతుంది. ఇవన్నీ వాక్కుకు అంటే వాచకమౌనానికి సంబంధించినవి. మరి, మాట్లాడకుండా ఉన్నప్పుడు కూడా మనసు ఎటెటో పరుగులు తీస్తుంటుంది గదా! అదే మనం సాధించవలసింది. ఆ మనసుకు ఏదో ఒక ఆలంబన చూపితే అది దానినే చింతన చేస్తూ ఉంటుంది. మౌనం దీర్ఘమవుతున్న కొద్దీ క్రమంగా ఆ చింతన కూడా జారిపోయి కేవలం నిశ్శబ్దంగా ఉండిపోతుందన్నది అనుభవజ్ఞుల వాక్కు. ఇదంతా కేవలం

తపస్వులకు చెల్లిపోతుందిగానీ కర్మయోగులకెలా కుదురుతుంది? సంసార సాధకులకెలా కుదురుతుంది? - అన్నది ఒక సందేహం.

వీలైనంతగా మాటల వాడుకను తగ్గించుకోవచ్చు. అందరం కలిసి కూర్చున్నాం. ఎక్కడో దొంగతనం జరిగిందన్న ప్రస్తావన వచ్చింది. ఇక ఎవరి అనుభవాలు వారు చెప్పటం ప్రారంభిస్తారు. ఇవన్నీ కలబోసుకోవటం వలన వచ్చే ప్రయోజనం దాదాపు శూన్యమే. ఎదుటివారిని గురించిన సమాచారం అంతా రాబటట్టం కోసం ఎంతో సమయం, శక్తి వ్యర్థం చేస్తుంటాం. ఒకటి, రెండు మాటలతో ముగించగల పలకరింపులు ఐదారు నిముషాలకు సాగదీస్తాం. కలిసి ప్రయాణాలు చేసేటప్పడు, ఏ పార్క్‌లోనో కలిసినప్పడు మరెప్పడైనా-అపరిచితులతో కూడా రాజకీయాలు, సాంఘిక సమస్యలు వగైరాల మీద పనికిరాని చర్చలు, వాదాలు చేస్తుంటాం ఇవన్నీ కలిసి సాధనను కుంటుబరుస్తాయి. ఇక కుర్రవాళ్ల సంగతైతే చెప్పే పనే లేదు.

సాధకులు తాము వ్యర్థ వాక్యాలు ఎన్ని మాట్లాడుతుంటారో గమనించుకొంటూ ఉండాలి. ప్రక్కవారితో మాట్లాడకపోతే అనుబంధాలు తగ్గిపోతాయి గదా అన్నది ఒక ప్రశ్న. మాట్లాడుదాం కానీ ఆ సంభాషణను సద్విషయాలవైపు, భగవద్విషయాలవైపు మళ్లిద్దాం. వాళ్ల కష్టాలు విందాం. ఎంతవరకు? వాళ్లు మనను కూడా ఊబిలోకి లాగనంతవరకే. నవ్వుదాం-అది మన సాధనను నవ్వుల పాలు చెయ్యనంతవరకే. పతివ్రత అయిన స్త్రీ మనసు పతిపైనే ఎలా లగ్నమవుతుందో-భక్తుడి సర్వశక్తులూ భగవంతునిపైనే లగ్నం కావాలి, ఎన్ని పనులు చేస్తున్నా దృష్టి, భావన అక్కడే లగ్నమవ్వాలి. అందుకు అనువుగా ఉండేలాగా మన సంభాషణ తీరును, మాటల వాడుకను మలుచుకోవాలి. అంతవరకు పాటించగలిగినా కొంత మౌనం అలవడినట్లే, క్రమంగా ఆ వాచామౌనమే మానసిక మౌనానికి దారితీస్తుంది. ఆ మౌనశక్తి గురుదేవులు, శ్రీ సాయి మనకు అనుగ్రహింతురు గాక!





# గురుదేవులతో కబుర్లు

గురువుగారండీ, నమస్కారమండీ!

ఇవ్వేళ ప్రొద్దున్నే ఓ పే.....ద్ద నెమలి వచ్చింది. పింఛం ఆరబోసుకొని నాట్యం చేసింది కాస్సేపు - ఎక్కడంటారా - మీ శయనాగారం వెనక పాండ్స్ పూలంటాం చూడండి - ఆ చెట్ల ప్రక్కన. మీరు కూడా చూచే ఉంటారులెండి. నిన్న మాధవరావుగారు మిమ్మల్ని చాలాచాలా తలుచుకున్నారు. అందరం రోజూ .... రోజూ ఏమిటి క్షణక్షణం తలచుకొంటూనే ఉంటామనుకోండి. కానీ, ఆయన తలచుకున్న కారణం వేరు. పడుకొని ఏదో ఆలోచిస్తోంటే పరమాత్మ ప్రేమను గురించి ఏదో అద్భుత విషయం స్ఫురణకు వచ్చింది. "దాన్ని గురువుగారితో పంచుకొని, వారి భావాలు తెలుసుకుందామనుకొన్నాను. లేచి, ఉత్తరీయం వేసుకుని బయటికి రాబోతోంటే .... అప్పడు గుర్తు వచ్చింది. గురువుగారు లేర"ని అంటూ కన్నీరైపోయారు. అటుపై "కృష్ణా కేమ్ ఫర్ మీ ఎగైన్. ఐ కుంట్ రికగ్నైజ్ హిమ్ దెన్" అంటూ మీ సహనం గురించి ఎన్నెన్నో అనుభవాలు చెప్పకొచ్చారు.

మొన్న ప్రొద్దున్నే పది, పన్నెండు రామచిలకలు వచ్చి 'భారతి' లైబ్రరీ ప్రక్కన ఎండిపోయిన యూకలిప్టస్ చెట్టు మీద వాలాయి. చైత్ర పరుగెత్తుకొంటూ వచ్చి చూడ్డానికి రమ్మని నన్ను పిలిచింది. అదే ఉత్సాహంతో మీ గది వైపు పరుగెత్తబోయి, మీ కుర్చీలోని మీ పటాన్నీ, ముందర వెలిగే దీపాన్నీ చూచి నిలువెల్లా నీరైనట్లు అలాగే నిలబడిపోయింది. "నాకు గురువుగారు గుర్తు వస్తున్నారు" అని రోజంతా అంటూనే ఉంది పాపం. మీకేమో యింత దయలేకపోయింది గదా! పున్నాగల జల్లులు ఆగిపోయాయి. సువర్ణ గన్నేరు, గులాబీలు బాగా పూస్తున్నాయి-దేవకాంచన కూడా.

మన స్కూల్లో బాల కవి సమ్మేళనం క్రొత్తగా ప్రారంభించాం యీ సంవత్సరం. అప్పడెప్పడో పాతికేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఆశువుగా కవితలు

చెప్పిస్తే (పిల్లలతో) 'మీ స్కూలు పిల్లలు బాగా చదువుకొన్న తల్లిదండ్రులున్నవారు. అందుకే త్వరగా అందుకోగలుగుతున్నారు నీవు చెప్పినవి' అన్నారుగా మీరు! ఇదుగో - యీ ఏడు నవంబరు 14న అప్పటికప్పుడు విషయాలిచ్చి వ్రాయిస్తే-ఎంత ముద్దుగా వ్రాసారనుకున్నారు! మీరుంటే "చూచారా, మీ స్కూల్లో కూడా వ్రాయించాను" అని సగర్వంగా కాలరెగరేసి, అటుపైన సవినయంగా మీ పాదాలకు నమస్కరించి ఉండేదాన్ని. నాకా భాగ్యం లేకుండా చేసారు మీరు.

అన్నట్లు జ్ఞానధామానికి తొలి పుట్టింగ్ పోస్తోంటే మళ్ళీ ఆ రెండు మూతుల పాము వచ్చింది ఆ గోతిలోకి. అందరూ సంతోషించారు. మొన్న పాపాయి వచ్చి ఒక వారం రోజులు ఉండి వెళ్లింది. ఇవన్నీ బయటి కబుర్లు. మనసు లోపలి వేదనలు ఎవరికి చెప్పకోను! ప్రభాత వేళ సూర్య భగవానుని వన్నెలలో మీరు - పశ్చిమాన సంజకెంజాయలో మీరు - నీలం, ఎరుపు, తెలుపు కలిసిన సుషమావర్ణంలో మీరు - సాయి ఆలయం ముందు పుష్కరిణిలో విరిసిన కలువలలో మీ నవ్వు - మీరు లేనిదెక్కడ? అంతటా మీరుంటారని తెలుసు. మరి, కనగల కన్నులు మాకు లేవే! అదే ఆవేదనకు మూలం. 'అజ్ఞానం' అంటారా? అవును. మాకు జ్ఞానం వచ్చేదాకా ఆగారా మీరు మరి! బాలారామ్ మాన్‌కర్‌ను పంపించారు మచ్ఛీంద్రగఢ్‌కు బాబాగారు. "చూడు - అక్కడ షిర్డీలోనే ఉన్నాననుకొన్నావు. ఇక్కడ లేనా?" అన్నారు అతనికి అక్కడ దర్శనమిచ్చి. మీ దర్శనం మాకెప్పుడు గురుదేవా? అవునూ - మీరిప్పుడు భూతకాలమా? అదెలా? పరమాత్ముడు కాలస్వరూపుడు గదా! కాలాతీతుడు గదా! యోగులు తన సజీవ ప్రతిమలని గీతాకారుడు చెప్పారు గదా! అలాంటప్పుడు మీరూ తద్ధర్మకాలమే గానీ భూతకాలం ఎలా అవుతారు? మరి చూచే శక్తినివ్వరూ మా మనశ్చక్షువులకు!

మీ ఆనందుడు వ్యాధిగ్రస్తులయ్యారు-మీమీద బాగా బెంగపడ్డారు. ఒక్కసారి స్వప్నంలోనో, ధ్యానంలోనో అగుపించి ఆశ్వాసించండి ప్రభూ! ఇదే పాదాభివందనం, కన్నీటి అభిషేకం.

- మీ, పిచ్చితల్లి.





# నారాయణ మోతీరాం జాని

- మాతా శుకవాణి

నాసిక్‌లో నారాయణ అనే ఒక భక్తుడుండేవాడు. అతను రామచంద్ర వామన మోదక్ అనే ఆయన దగ్గర ఉద్యోగం చేసేవాడు. అతను కూడా సాయిభక్తుడే. ఒకసారి నారాయణ తన తల్లితో కలిసి షిరిడీ వెళ్లి సాయి దర్శనం చేసుకున్నాడు. బాబాగారు అతనిని ఆశీర్వదించి "ఇంక మీదట నీవు సొంతంగా వ్యాపారం పెట్టుకో" అని చెప్పారు. నారాయణ అలాగే రామచంద్ర దగ్గర కొలువు మానేసి ఒక చిన్న హొటలు పెట్టుకున్నాడు. కాలక్రమాన అది బాగా అభివృద్ధి చెందింది. అతడు బాబా భక్తిని విడవకుండా జీవిస్తున్నాడు. ఇలా ఉండగా ఒకసారి నారాయణ మిత్రుడొకాయనకు తేలు కుట్టింది. అతను బాగా బాధపడుతున్నాడు. బాబా విభూతి రాస్తే నొప్పి తగ్గుతుందని నారాయణ అనుకొన్నాడు. కానీ, ఇంట్లో విభూతి దొరకలేదు. ఒక్కక్షణం ఆలోచించాడు. బాబా పటం ఎదుట నిలబడి ధ్యానం, నామ జపం చేసాడు. పటం ముందర వెలిగించిన అగరువత్తుల బూడిద తీసుకుని, అదే ఊదీగా భావించి, తన మిత్రుడికి తేలు కుట్టినచోట రాసాడు. చిత్రంగా నొప్పి తగ్గిపోయింది.

ఈ ఇతివృత్తం మనకొక మంచి సందేశం యిస్తోంది. సాయీ విభూతికి అనంతమైన శక్తి ఉంది. ఆ విషయం శ్రీ సాయి భౌతిక శరీరంతో ఉన్నప్పడే ఎన్నోసార్లు ఋజువైంది. అయితే యీ శక్తి కట్టెలు మండటం వలన వచ్చిందా? ఆ కట్టెల నాణ్యత వలన వచ్చిందా? శ్రీ సాయి హస్తవాసి వలన వచ్చిందా? లేక మన భావన వలన వచ్చిందా? దీన్ని గురించి కాస్త ఆలోచిస్తే ..... సాయినాథుల వారు ధునిలో కాల్చినవి మామూలు కట్టెలు కావు - మన దోషాలే. పైగా వారు అవిశ్రాంతంగా మండించిన ఆ

ధునిలోని ఊదీ ఎందరెందరి కష్టాలనో తీర్చిందన్నది మనకు తెలుసు. అలాటి వాటిలో మైనతాయి కథ, దాసుగణును గజదొంగ బారి నుండి రక్షించిన కథ ప్రసిద్ధాలే. మరి, బాబాగారు గతించాక కూడా ఎన్ని లక్షల మందో ఊదీ వలన లబ్ధి పొందారు గదా! అదెలా జరిగింది? అది బాబావారు అలనాడు వెలిగించిన ధునిలోనిదే గనుక ఆ ప్రయోజనం ఉన్నదనేది ఒక సమాధానం. కానీ, అనేకానేక సాయి దేవాలయాలలో పంచే ఊదీకి కూడా ఆ ఆధి, వ్యాధి నివారణ శక్తి ఉన్నదనే భక్తుల అనుభవం. అదెలా సాధ్యం అన్నది మరో సందేహం. 'యద్భావం తద్భవతి' అన్నది శాస్త్రోక్తి. మన ఆలోచన-భావన-విశ్వాసం మనలో ఒక నూతన - ఆఁహాఁ! నూతన కాదు-నిద్రాణమై ఉన్న మానసిక శక్తులను జాగరితం చేస్తుంది. స్వామీ శివనేశన్ దశాబ్దాల తరబడి తన చెంతకు వచ్చే భక్తులచేత నేతితో ధునిలో కొబ్బరికాయలు వేయించి ధుని పూజ చేయించటంలో ఉన్న రహస్యం యిదే. సాయి కరుణ వలన ఆ భక్తుల దోషాల బలమూ తగ్గుతుంది-వారి మనోబలమూ పెరుగుతుంది. ఆ ఫలితాన్ని స్వయంగా అనుభవించిన వారు వేలాదిమంది.

మనిషి భావతరంగాలకు - అందులోనూ సాధకుల భావత రంగాలకు అద్భుతమైన బలం ఉంటుంది. సహజంగా కూడా ఎక్కడో బిడ్డ భయంతో, బాధతో 'అమ్మా' అని అరిస్తే నిద్రలో ఉన్న తల్లి ఉలికిపడి లేస్తుంది. గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానందప్రభుజీ వారు, శిష్య సమేతంగా షిరిడీ వెళ్లారు. ఆ బృందంలో నేనూ ఉన్నాను. ద్వారకామాయిలో కూర్చొని ధ్యానం చేసుకొంటున్నాం. నా మనసులో "సాయీ, నీ రక్షాదక్షమైన దివ్య హస్తాన్ని ఎందురు భక్తుల శిరస్సులపై ఉంచి ఆశీర్వదించావో యీ పావన ప్రదేశంలో! ఒక్కసారి ఆ చేతితో నా తలతాకి నా ఆర్తి బాపలేవా స్వామీ!" అనుకొంటున్నాను. మనసు ద్రవిస్తోంది. అది కళ్లలోకి పొంగివస్తోంది.





కనుల ముందరి రూపం మసకబారుతోంది. సరిగ్గా ఆ క్షణంలో గురుదేవుల చేయి నా శిరస్సుపై కదిలింది. కనులు తెరిచి చూచి, "ఎందుకలా ఆశీర్వదించారు"ని అడిగాను. వారు చిరునవ్వుతో "అడిగావేమో!" అన్నారు. నా భావతరంగాలు సాయిని తాకి, ఆ తండ్రిని తనలోకి ఆవాహన చేసుకున్న గురుదేవులను తాకాయన్నమాట. అదీ భావనకున్న బలం.

అందుచేతనే నారాయణ మోతీరాం జాని అగరువత్తుల బూడిదను బాబా ఊదీగా భావిస్తే అది నిజంగా ఊదీశక్తినే సంతరించుకొన్నది. ఇక భక్తిశ్రద్ధలతో ఊదీని ధరిస్తే అది ఎన్నెన్నో మహిమలు చేయగలదనటంలో సందేహం లేదు. మనందరం సాయీ భక్తులం, దాసులం, ప్రేమికులం. సాయి సందేశాలను పది మందికీ అందించాలన్న తపన గల వాళ్లం. అలా చేయటం వలన అందరికీ-చెప్పే వారికీ, వినే వారికీ కూడా మేలు కలుగుతుందని నిస్సంశయంగా నమ్ముతున్న వాళ్లం. మరి, విభూతి ద్వారా సాయినాథుల వారి శక్తి సర్వజనులకూ అందేలాగా చూస్తున్నామా-అని మనం యిప్పుడు ఆలోచించుకోవాలి. మనం పనిచేసే కంపెనీలలో, ఆఫీసు లలో, కర్మాగారాలలో, కళాశాలల్లో, ఆసుపత్రులలో యీ విభూతి పంచాలి. అంతకన్నా ముందర మనం నిత్యం ఊదీని రవంత నోట్లో వేసుకొని, నుదుట ధరించాలి. కష్టంలో ఉన్న యిరుగుపొరుగులు, సాటి రోగులు, తోడి ఉద్యోగులు-అందరికీ నిత్యం బొట్టు పెట్టుకోవడానికి ఇది ఇవ్వాలి. కొంతమందికి అది నచ్చకపోవచ్చు. తీసుకోకపోవచ్చు. వారిపై బాబా కరుణ అంతే ఉన్నదో-వారికింకా బాధ అనుభవించే ప్రారబ్ధం మిగిలి ఉందో అనుకోవాలే తప్ప మనసు చిన్నబుచ్చుకోవటం గానీ, వారిని నిందించటం గానీ మంచిది కాదు. ఆసుపత్రిలో ఉన్న మన మిత్రుడిని చూడటానికి వెళ్లాం. అతనికి విభూతి పెడతాం. చిన్న పొట్లం అతని తలక్రింద పెడతాం.

చుట్టూ అలా బాధపడుతున్న వాళ్లు చాలామంది ఉన్నారు గదా! వారికి కూడా యీ ఊదీ మహౌషధం అందజేద్దాం.

ఒక్క దైహిక (శారీరక) వ్యాధులకే కాదు-ఆధులకు (మనో వ్యాధులకు) కూడా విభూతి దివ్యౌషధమే. మనం ఉన్న వీధిలో పది, పదిహేను ఇళ్లున్నాయనుకొందాం. వాటిని యీ విషయంలో దత్తత చేసుకుందాం. కుటుంబసమస్యలతోగానీ, పిల్లల నడవడికల గూర్చిన బాధలతోగానీ, మరేవైనా యిబ్బందులతోగానీ, పిల్లల నడవడికల గూర్చిన బాధలతోగానీ, మరేవైనా యిబ్బందులతోగానీ మన వీధిలోని ఏ యింటివారైనా ఆవేదనలకు, ఆందోళనలకు లోనవుతున్నపుడు మనం సాయి విభూతిని వారికి అందజేయాలి. దాని శక్తిని వివరించి చెప్పటానికి ముందు సమస్య లను సానుభూతితో విని, తరువాత యీ ప్రయత్నం చేయాలి. విశ్వాసంతో సాయినామం స్మరించి వారికి అందించండి-వీలైతే చిన్న ఫొటోతోసహా. సచ్చరిత్రగానీ, అంత సమయం కేటాయించలేరనుకొంటే చిన్నది- 'సాయినాథ చరితామృతం'గానీ పారాయణ చెయ్యమని చెప్పండి. దాని వలన వారి కష్టాలూ పోతాయి, సాయి మీది శ్రద్ధతో జీవితాలూ పునీతమవుతాయి. పైగా మనకూ, వారికీ మధ్య శ్రీ సాయి బాంధవ్యం పెరిగి సామాజిక స్పృహ పెరిగే అవకాశమూ ఉంటుంది. ఈ విషయంలో మన క్రైస్తవ మిత్రులను మనం ఆదర్శంగా తీసుకొని, సాయిప్రేమను వీలయినంత ఎక్కువమందికి అందిస్తూ, వ్యాపింపజేస్తూ వెడదాం. షిరిడీ లోని ధుని నుండీ తెచ్చిన నిప్పుతో వెలిగించిన ధుని సాయిధామం ఆశ్రమంలో ఉన్నది. పై రీతిలో పదిమందికి పంచుదామనుకొన్న సాయీ భక్తులు తమకు అవసరమైనంత ఊదీని యిక్కడి నుంచీ కూడా తీసుకువెళ్లవచ్చు ఏరోజైనా.







# శ్రీ గురుదేవుల ఆశీస్సులందుగాక!



శ్రీమతి విజయ, శ్రీ ఎన్.నాగేశ్వరరావుగారు సంస్థ ఆరంభం నుండీ దీనితో అనుబంధం ఉన్నవారు. విశేషించి నాగేశ్వరరావుగారు శ్రీ ఆనందంగారికి దగ్గరి మిత్రులు కూడా. గురుదేవుల పట్ల విశేష గౌరవం ఉన్న శ్రీమతి విజయ వలన ఆశ్రమంతో బంధం బలపడింది వారికి. వారి కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతి భారతి వివాహం చి॥ సంతోష్ కుమార్‌తో నవంబరు 15వ తేదీ ఉదయం గం.9.58 ని.లకు హైదరాబాద్ ఉప్పల్ బస్ డిపో దగ్గర కళ్యాణమంటపంలో సశాస్త్రీయంగా జరిగింది. అభిమానులైన సాయిధామవాసులు వివాహ వేళ వధూవరులపై అక్షతలు చల్లి ఆశీర్వదించారు. విజయ, నాగేశ్వరరావు దంపతులు ఆశ్రమం వారిని సత్కరించుకున్నారు. ఉన్నత విద్యావంతు లైన యీ నవ దంపతులు పరస్పరాన్యోన్యతతో కలకాలం జీవించి, సత్సంతానవంతులై, వారిని లోక కళ్యాణకారకులుగా తీర్చిదిద్ది, తమ గృహస్థ జీవితాన్ని ఫలవంతం చేసుకోగలరని సాయివాణి ఆశీర్వ దిస్తున్నది. ఈ ఆశీస్సు విని పరమపూజ్య గురుదేవులు "తథాఽస్తు" అందురుగాక!

స్వర్గీయ శ్రీ అమ్మసాని సత్యనారాయణరెడ్డిగారు బోడుప్పల్ నివాసులు. వారు మంచి దైవభక్తులు, దాతలు కూడా. వారి కుమార్తె శ్రీమతి జయశ్రీ, అల్లుడు శ్రీ మహేందర్‌రెడ్డి గారలు తమ కుమార్తె చి॥సౌ॥ శృతి వివాహం చి॥ శ్రీరామ్‌రెడ్డితో నవంబరు 18వ తేదీ ఉదయం పది గంటల వేళ-బైరామల్‌గూడాలోని కళ్యాణ మంటపంలో జరిపించారు. నవ వధూవరులు ఒకరి మనసులో ఒకరుగా జీవించి, సత్సంతానవంతులై, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్ది, దేశమాత ఋణం తీర్చుకోగలరని సాయివాణి ఆశీస్సులందిస్తున్నది. గురుదేవా, తథాస్తు అనండి.

# సత్యం విశ్వజనీనం

- మాన్యశ్రీ ఎం.వి. మాధవరావుగారు

వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైన గ్రంథాలన్నీ భారతీయ సనాతన ధర్మాలకు కాణాచులు. అవి గొప్ప సత్యాలనే ఆవిష్కరిస్తాయి తప్ప మానవులను త్రోవ తప్పించవన్నది మన విశ్వాసం. ఋషి పరంపర, సాధు సత్పరుషులు తమ తపశ్శక్తితో, తమ దివ్య దర్శనాలలో చూచిన గ్రహించిన అఖండ సత్యాలనే మనకు చెప్తూ వచ్చారు. అందుచేత మన గడ్డ మీద ఆధ్యాత్మిక చింతన శతథా వర్థిల్లింది. భగవత్స్వరూపం నిరాకార మనీ, కేవలం సామాన్య మానవుని శ్రద్ధ స్థిరపడటానికి సాకార రూపాలు స్వీకరిస్తున్నామనీ, పరమాత్ముడు కాలాతీతుడనీ సర్వజీవులలోనూ నిండి ఉంటాడనీ, అందుచేత ప్రతి జీవీ పరమాత్మ స్వరూపుడేననీ గ్రహించ గలిగాము. అయితే యిది భారత జాతికి మాత్రమే పరిమితమా? అసలు తపస్సంటే ఏమిటి?

తన తను మన శ్శక్తులన్నింటినీ ఏకీకృతం చేసి ఒకే లక్ష్యంపైన నిలిపి, తైలధారలాగా అవిచ్ఛిన్నంగా స్మరిస్తూండటం-అదే వైపు పయనిస్తూండటమే తపస్సు. దేశాలు, ఖండాలు అంటూ మనం కేవలం గుర్తు కోసం చెప్పకోవటమేగానీ నిజానికి విశ్వమంతా ఒకే అఖండ స్వరూపం. సత్యం కూడా అలాగే విశ్వజనీనం. అది ఎప్పడూ సజీవమే, ఎక్కడైనా సజీవమే. ఐతే గ్రహించే వ్యక్తులలో అంతరాలుండవచ్చు. శ్రీ సాయి సచ్చరిత్రలోనూ, అనాదికాలంగా అనేకానేక శాస్త్రాదులలోనూ చెప్పినట్లుగా జీవి సహజంగా జ్ఞానస్వరూపుడే. (భగవంతుడి నుంచీ విడిపోయి వచ్చిన చిన్న శకలమే గదా మరి!) అతడిని తాను దేహానికే పరిమితుడనన్న భ్రాంతి కమ్మి ఉంటుంది. అదే మాయ. ఆ మాయను ఛేదించి, ఆ మసిని తుడిస్తే లోపల వెలిగే అంతర్జ్యోతి ఆ జీవి జీవితాన్ని ప్రకాశవంతం చేస్తుంది.





మానవుని తపశ్శక్తి అతనిని విశ్వవ్యాప్తమై ఉన్న చిచ్ఛక్తికి దగ్గర చేస్తుంది. క్రమంగా దానిని ఆవాహన చేసుకోగల శక్తిని సంతరించుకోగలడు మనిషి. అదే తపస్సిద్ధి.

ఇలా ఏకాగ్రచిత్తంతో నిష్ఠతో ఒకే విషయంపై బుద్ధిని, చిత్తాన్నీ లగ్నం చెయ్యడాన్ని తపస్సంటారు-అని తెలియనక్కరలేదు. దాని తాలూకు శిక్షణలు, అధ్యయనాలు ఏవీ అవసరం లేదు. అవి కొంతవరకు నిష్ఠకు ఉపకరిస్తాయే తప్ప అత్యవసరాలు కావు. అత్యవసరమైనది చిత్తం లక్ష్యంలో లయించడమే. అంతర్జ్యోతి ప్రకాశాన్ని గుర్తించి, స్వీకరించడమే. పాశ్చాత్యదేశాలలోని కొందరు ఆధ్యాత్మిక వేత్తలు-మన ప్రాచీన మహర్షులు, మహా కవుల లాగానే లోతులకు వెళ్లి ఆలోచించారు. సత్యాన్ని దర్శించారు. 'పేరడైజ్ లాస్ట్' 'పేరడైజ్ రీ గెయిన్డ్' వంటివి దీనికి ఉదాహరణలు. అంతకన్నా అద్భుతమైన ఋజువులు మరికొన్ని ఉన్నాయి. భగవంతుడు, ఆధ్యాత్మికత కేవలం ప్రాచ్య దేశాల సొత్తే కాదు. పశ్చిమ దేశాలలోనూ, తూర్పు దేశాలలోనూ సమానంగా నడిచిన అనేకాంశాలలో వారాల పేర్లలో కొన్ని ఉన్నాయి. ఆదివారం ఆదిత్యవారం, రవి వారంగా మనం భావించే రోజును వాళ్లు కూడా సూర్యుడి పేరు మీదనే "సన్ డే" అన్నారు. చంద్రుని పేరిట మనం సోమవారం అన్న దానిని వారు కూడా మూన్ డే అన్నారు. అదే 'మన్ డే' అయింది. అసలివన్నీ దేనికి?

మనం భగవంతుని పూజించేటపుడు "కాలాయ నమః, కాలకాలాయ నమః, కాలాతీతాయ నమః అని చదువుతాము. కాలం దైవస్వరూపమని భావిస్తాం. దైవం అనాదీ, అనంతుడూను. ఆయనకు మొదలేదో, చివరేదో ఎవరికీ తెలియదు. శివలింగపు తుది, మొదళ్లు వెదుకుతూ బ్రహ్మ, విష్ణువు వెళ్లారట శివరాత్రినాటి స్తంభోద్భవ వేళ. ఆయనకు అంతమూ దొరకలేదు. ఈయనకు ఆదీ తెలియలేదు. ఈ కథ శివరాత్రి గురించి వింటుంటాం. దీనిలోని ముఖ్యాంశం అదే-పరమాత్మ ఆద్యంతరహితుడు-అని. మరి పాశ్చాత్యులు యీ విషయాన్ని ఎలా సూచించారో చూడండి. కాలానికి

తొలి యూనిట్‌గా వాళ్లు చెప్పింది 'సెకండ్' అని. అది సెకండ్‌గానీ ఫస్ట్ కాదు. అంటే కాలం అనేది ఎప్పడు ప్రారంభమైందో ఎవరికీ తెలియదనే గదా అర్థం. అలాగే సంవత్సరాల వరకూ, ఇంకా ఆపైన. చాలాచాలా-అటుపైన మన్వంతరాలు-ఇంకా ఆపైన ఏవేవో ..... అంతేగానీ అంతం లేదు కాలానికి. అది ఎప్పడు ఆగుతుందో మనకూ తెలియదు, పాశ్చాత్యులకూ తెలియదు. కాలం ఆద్యంతరహితమన్నది యిద్దరికీ సమానాభిప్రాయం.

ఇంకొకటి చూద్దాం. ఆంగ్లంలో నేను అనే అర్థంలో 'ఐ' అనే అక్షరం వాడతారు. అది ఎప్పడూ కేపిటల్ లెటర్ (పెద్దక్షరం)గానే వ్రాస్తారు. భగవంతుడు అన్న అర్థంలో 'గాడ్' అన్న ఆట మొదటి అక్షరం ఖచ్చితంగా పెద్దక్షరమే. 'జి' వ్రాస్తారు. గాడ్‌కు సర్వనామంగా వాడబడే 'హీ' అన్న దానిలోని తొలి అక్షరం కూడా పెద్దక్షరమే. 'హెచ్' వ్రాసార్తు. "ఐ - గాడ్-హీ" ఈ మూడింటినీ గౌరవించిన విధానం చూస్తేనే అర్థమవుతుంది- భగవంతుడెంతో తానంత అని భావిస్తున్నారు వాళ్లు అని. అదే మనం "అహం బ్రహ్మాస్మి" అన్నాం. అందుచేత మిత్రులారా, మోక్షగాములైన భక్తులారా, సత్యం అన్నది ఎక్కడైనా ఒక్కటేననీ, దాన్ని గ్రహించటంలోనే భేదాలున్నాయనీ గ్రహిద్దాం. సత్యం ఎక్కడున్నా గౌరవిద్దాం. ఆ సత్యమే పరమాత్మ.

అన్ని మతాలలోనూ, అన్ని దేశాలలోనూ, అన్ని జాతులలోనూ కూడా మహనీయులు, భగవచ్చింతకులు, తపస్సిద్ధులు ఉంటూనే ఉంటారు. కాకపోతే కొన్నిచోట్ల తక్కువ-కొన్నిచోట్ల ఎక్కువ కావచ్చు. మనం భౌతిక భోగాలు అనుభవించి, ఆధ్యాత్మికత లోతులకు వెళ్లి, తిరిగి భౌతికాకర్షణ వైపు మొగ్గు చూపిస్తున్నాం. విదేశాలేమో యింకా భౌతికాభివృద్ధి సాధనలోనే-కాకపోతే ఉన్నతస్థాయిలో ఉన్నాయి. దానితో విసిగిపోయిన వారు తిరిగి ఆధ్యాత్మికతవైపు తిరుగుతున్నారు. కాలచక్రం. అది భ్రమిస్తూనే ఉంటుంది. ఆ భ్రమణంలో పై ఆకు కిందకీ, క్రింది ఆకు పైకీ కావటం సహజం. అది మనం గ్రహించాలి.





# కబీరు అమృత వాక్కులు

- తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు

కబీరు నోటి నుండి అమృతవాక్కులా వెలువడిన దోహా ......

**దోహా॥ నిందక్ నేడా రాఖమే, ఆంగణి కుటి బధాయీ!**

**బిన్ సావణ(సాబూన్) పానీబినా, నిర్మల్ కరై సుఖాయీ !!**

మనల్ని విమర్శించే వారిని, ఆదరపూర్వకంగా మన వద్దనే అట్టే పెట్టుకోవాలి. ఎందుకంటే వారు మనలోని పాపాల్ని వారి కువిమర్శతో-సబ్బు, నీళ్లు, ఏమీ అవసరం లేకుండానే శుభ్రంగా కడిగివేస్తుంటారు. అందరి మలమూత్రాలనీ, తన నోటితో, నాలుకతో తిని శుభ్రం చేస్తుంది పంది. అన్ని ప్రదేశాల నుండి పారి వచ్చే మురికి నీటినే తన శరీర తాపం తీర్చుకోవటానికి స్నానపునీరుగా వాడుకుంటుంది.

తమలోని లోపాలు సరిచేసుకోలేని వారు, ఇతరులలో లోపాలు ఎంచుతూ, విమర్శించేవారు పందిలాంటివారు.

సద్గురువునూ, సద్గురు బోధనూ సవ్యంగా అర్థం చేసుకోవడానికి అందరూ ప్రయత్నించాలి.

**సింహం ఎంత దీనస్థితిలో ఉన్నా అల్పత్వానికి పాల్పడదు - అందుకే అది మృగరాజు.**

**గాలిపటం ఎగరెయ్యగలంగానీ ఆడించలేం.**

**ప్రజలను రెచ్చగొట్టగలంగానీ అదుపు చెయ్యలేము.**

# హెచ్చరిక

కబీరు గొప్ప సూఫీ సిద్ధాంతి. ఆయన బోధలు గొప్ప తాత్త్వికతను, భారతీయాత్మను ఆవిష్కరిస్తాయి. ఈ దోహా విందామా

**సాధు సముందర్ జానియో, మహిరతన్ భరాయ్ ।**

**మంద్ భాగ్ మూఠీ భరై కర కంకార్ ఛడీ జాయ్ ॥**


సాధు సత్పరుషులు అగాధసాగరం వంటివారు. వారిలోపల అనంత మైన రత్నాలుంటాయి. సముద్రపు లోతులకు దిగగలవారు ఆ అద్భుత, అమూల్య రత్నాలను చేజిక్కించుకోగలరు. అలా దిగలేనివారు సముద్రం "ఎంత బావుందో, ఎంత గొప్పదో!" అని మెచ్చుకొంటూ ఒడ్డున ఉన్న గవ్వ లనూ, నత్తగుల్లలనూ మాత్రమే ఏరుకొని, వాటినే ప్రదర్శించుకొని మురిసిపోతారు. అలాగే సాధు సత్పరుషులకు సేవచేసి, వారు అందించిన అగాధ జ్ఞానరత్నాలను తమ సొంతం చేసుకోవటం వివేకులు చేసే పని. పైపై సిద్ధులకో, శక్తులకో పరవశించి, అంతటితోనే తృప్తిపడి ఊరుకోవటం మూర్ఖుల పని.

మేరుపర్వతం దగ్గరకు వెళ్లి ఒక గ్రాము బంగారం గిల్లుకొని వచ్చేవాడు అవివేకి అవుతాడు. చక్రవర్తి 'నీకేం కావాలో కోరుకో' అంటే అత్యున్నతమైన పదవో, అతి విలువైన వస్తువో కోరుకోవాలిగాని ఒక పూట భోజనమో మరో కటో కోరుకోం గదా! ధ్రువుని వంటి పరమభక్తుడే, ఐదేళ్లప్రాయం నుండీ తపించి, తపించి భగవద్దర్శనం చేసుకున్నవాడే యీ పొరపాటు చేసాడు. శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమైతే అందరికన్నా ఎక్కువ ఎత్తైనచోట ఉండాలని కోరుకున్నాడు. తరువాత దుఃఖించాడు-'ముక్తి కోరుకోనైతినే!' అని.

అందుచేత కబీరు మనకు ఇలా హెచ్చరిక చేస్తున్నారు. సాధు సంతులు మీ యోగ్యతను, మీ మానసిక భావనను బట్టి మీకు మేలు చేయగలరు. దానికి అనుగుణంగా మీ యోగ్యతను, పరిణతిని పెంచుకోండి. సరైన ప్రయోజనం పొందండి. పూతమెరుపులతో, నశించిపోయే వస్తువులతో, కోరికలతో సంతృప్తిపడకండి. శాశ్వతజ్ఞానాన్ని పొందే ప్రయత్నం చేయండి.







# శ్రీ గజానన విజయం

- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

గజాననులు భాస్కర్‌ను తమ విడిదికి తీసుకువచ్చారు. భాస్కర్‌కింక రెండు రోజుల ఆయువే మిగిలి ఉన్నదని బాలాభావుకు చెప్పారు. "బాలా, నీకు గుర్తుందా? ఒకసారి నిన్ను గొడుగుతో అది విరిగేదాకా నేను కొట్టడానికి కారకుడైనాడు భాస్కర్. అతన్ని ఆ కర్మబంధం నుండీ విడిపించ డానికే ఇవ్వేళ ఇతన్ని కొట్టాను" అన్నారు గజాననులు. చైత్రంలో అమావాస్య వచ్చింది. సూర్యోదయం కాగానే భాస్కర్‌ను తమ ఎదురుగా పద్మాసనంలో కూర్చోమని చెప్పారు. మనసు ప్రశాంతంగా ఉంచుకొని భగవద్ధ్యానం చేసు కొమ్మన్నారు. ఇతరులను "విఠలా, విఠలా, నారాయణా' అన్న భజన చేయ మన్నారు. జనం భాస్కర్ నుదుట బుక్కాపూసి మెడలో పూలదండ వేసారు. అయిదు గంటల తరువాత గజాననులు "హర హరా" అన్నారు పెద్దగా. మరుక్షణంలోనే భాస్కర్ శరీరం నిర్జీవమై ఒరిగిపోయింది. భాస్కర్ విష్ణు లోకానికి చేరుకొన్నాడు.

ద్వారకేశ్వర దేవాలయ సమీపంలో భాస్కర్‌ను ఖననం చేయమన్నారు గజాననులు. అరటి ఆకులతో కట్టిన విమానంలో భాస్కర్‌ను తీసుకువెళ్లారు. చింత, వేప, మందార, మామిడి, మర్రి, మేడి, రావి మొదలైన చెట్లతో సుందరంగా, చల్లగా ఉన్న చోట సమాధి చేసారు అతనిని. పదిరోజుల పాటు అన్నదానాలు సాగాయి. అన్నం విరివిగా కనపడటంతో కాకులు గుంపులు గుంపులుగా వచ్చి భక్తులను చీకాకు పెట్టసాగాయి. దానితో కొందరు భిల్లులు వాటిని కొట్టడానికి విల్లంబులు తెచ్చారు. గజాననులు వారిని మందలించారు. "ఆ కాకుల తప్పేమీ లేదు. అవి భాస్కర్ ప్రసాదం కోసం వచ్చాయి. సాధారణంగా ఆత్మ పది రోజుల

పాటు ఇక్కడిక్కడే తిరుగుతుంటుంది. కాకులు ఆహారం ముట్టకపోతే జీవి యీ నశ్వర ప్రపంచాన్ని విడిచివెళ్లలేదు. భాస్కర్ కాకులకు వాటి ప్రసాదం అందిందో లేదో చూడకుండానే తిన్నగా వైకుంఠానికి వెళ్లిపోయాడు. అందుకే యివి అల్లరి చేస్తున్నాయి. అంచేత వాటిని చంప కండి, సరిగా ఉండమని వాటికి నేను చెప్తాలే!' అన్నారు.

విశ్వాసం ఉన్న వాళ్లు సరేనని తలలూపారు. అవిశ్వాసులు 'తిండి దొరుకుతున్న చోటికి కాకులు రావా? వీరు చెప్తే ఆగి పోతాయా? ఇదో వెర్రి!' అన్నారు. గజాననులు మరీ మహాత్ముడిలా అభినయిస్తున్నారని అనడానిక్కూడా వారు వెనకాడలేదు. వీరంతా ఆ మరునాడు తమ ఆలోచన సరైనదో కాదో పరిశీలించడానికి అక్కడికి వచ్చారు. తీరా చూస్తే ఒక్కటంటే ఒక్క కాకి కూడా రాలేదు. అన్నదానం జరుగుతూనే ఉందిగానీ ఒక్క కాకైనా లేదు. పధ్నాలుగు రోజుల తరువాత మహారాజు షేగాఁవ్ వచ్చారు.

అవి కరువు రోజులు. షేగాఁవ్‌లో ఒక బావి తవ్వుతున్నారు. సుమారు పదిహేను అడుగులు త్రవ్వేసరికి పెద్ద నల్లబండ అడ్డు వచ్చింది. దాన్ని పగలగొట్టకపోతే ఇంక లోతుకి వెళ్లటం కుదరదు. నాలుగు కన్నాలు వేసి మందు పెట్టారు. వత్తులు పెట్టారు. కానీ ఫ్యూజులలో ఏదో అడ్డు పడింది. నీళ్లు ప్రక్క నుండీ వస్తున్నాయి. డైనమైట్ వ్యర్థమైపోయేలాటిది. గ్రామ పెద్ద గణూజవారేని బావిలోకి దిగి అడ్డుపడిందేమిటో తొలగించమన్నాడు. అతడూ, తదితరులూ కూడా బావిలోకి వెళ్లడానికి భయపడ్డారు. కానీ గణూ గ్రామంలో మేస్త్రీ దగ్గర పనివాడు. అతడు మేస్త్రీ మాట, గ్రామ పెద్ద మాట కాదని బ్రతకలేడు. అంచేత భీతితో వణుకుతూనే గజానన మహరాజ్‌ను తనను రక్షించమని ప్రార్థిస్తూ బావిలోకి దిగాడు. మొదటి అడ్డంకి తొలగించేటప్పటికి పెద్ద భయంకరమైన చప్పడుతో మొదటి డైనమైట్ పేలిపోయింది. పొగమబ్బులతో బావంతా నిండిపోయింది.





మరొకటి పేలే లోపలే గణూ గజాననులనుద్దేశించి 'రక్షించండి దేవా!" అని అరిచాడు. ఇంతలో అతనికి బావి గోడలో ఒక గుహలాంటిది కన్పించింది. అతను చటుక్కున అందులోకి నక్కి నిలబడ్డాడు. అటుపైన మిగతా నాలుగు డైనమైట్లూ ఒక దాని తరువాత ఒకటిగా పేలిపోయాయి. గణూ బావిలోనే ఉన్నాడు.

ఇప్పడు మేస్త్రీ వణుకుతున్నాడు. గణూ చిన్న చిన్న ముక్కలైపోయే ఉంటాడు లోపల. భయపడుతూనే 'గణూ' అని పిలిచాడు. బావిలోకి తొంగిచూస్తూ. వెంటనే గణూ జవాబిచ్చాడు - "నేను క్షేమంగానే ఉన్నాను. నన్ను మహరాజు కాపాడారు. కానీ! నేనున్న చోటికి అడ్డంగా పెద్దరాయి ఉంది. దీన్ని తీస్తే బయటికి వస్తాను". అందరూ కలసి ఆ రాయి తొలగించి గణుని పైకి తీసారు. అతడు వెంటనే గజాననుల చెంతకు పరుగెత్తి నమస్కరించాడు. వారు నవ్వుతూ "ఆ పెద్ద రాయి నీకు అడ్డుగా పడటం వలననే నీవు బ్రతికావు. ఇంకెప్పడూ యిలా అలక్ష్యంగా ఉండకు" అన్నారు. "మీరే నాకు ప్రాణభిక్ష పెట్టారు స్వామీ!" అని గణూ పదేపదే నమస్కరించాడు.

**(11వ అధ్యాయం సంపూర్ణం)**

**చెడును దూషించటం కంటే మంచిని పోషించటం మేలు.**

**ఆత్మ పరిశీలన ప్రగతికి చుక్కాని.**

**నా గొప్ప నేనే చెప్పకోవటం అల్పత్వం.**
**ఇతరులు చెప్పకోవటం ఔన్నత్యం.**

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

**– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

22-02-1912

ఈ వేకువనే కాకడ హారతికి అందరం వెళ్లాం. షిర్కే కుటుంబీకులైన స్త్రీలు హారతి చేసుకొని వెళ్లిపోయారు. బొంబాయి నాట్యగత్తె కూడా తన వారితో కలిసి వెళ్లిపోయింది. ఆమె అమరావతి వెడతానని చెప్పింది. మా పంచదశి క్లాస్ నడిచింది. దాని తరువాత మా ఆవిడకు తొమ్మిది గంటలకు ముందర కల వచ్చిందని చెప్పింది. అందులో సాయిబాబా దాదాకేల్కర్‌నూ, బాలాషింపీని నేను తిరిగి వెళ్లటం గురించి అనుకొంటున్నానా అని అడిగారట. నటేకర్ (హంస) నాకు యీ మాసాంతంలో అమరావతికి అనుమతి దొరకవచ్చునని అన్నాడు. ఇవన్నీ కలిసి మా ఆవిడలో ఆశలు పెంచాయి. కానీ, మధ్యాహ్నహారతి సమయంలో బాబా యీ సంగతేమీ ఎత్తలేదు. మాధవరావు దేశ్‌పాండే హారతి వేళకు హర్దా నుంచీ తిరిగి వచ్చాడు. అతని భార్యా, పిల్లలూ అహ్మద్‌నగర్ నుంచీ తిరిగి వచ్చారు. మధ్యాహ్న భోజనం తరువాత కాస్సేపు పడుకొని లేచాక, చీకటిపడే దాకా పంచదశి చదువుకొన్నాం. ఆ తరువాత హడావుడిగా వెళ్లి సాయిసాహెబ్‌ను చూచి ఊదీ తీసుకున్నాను. రాత్రి భీష్మ దాసబోధ, భాగవతం చదివి భజన చేసాడు. భాటే, బాపూసాహెబ్ (అబ్కారీ ఇన్స్‌పెక్టర్) ఆయన పిల్లలు కొందరు నన్ను చూడడానికి వచ్చారు ఆ రాత్రి. మేమంతా కూర్చొని, సాయిబాబా దినదినం చూపించే మహిమల గురించి మాట్లాడుకొన్నాము. మాధవరావు దేశ్‌పాండే కూడా అక్కడున్నాడు.





23-02-1912

నేను మామూలుగానే లేచి ప్రార్థన తరువాత పంచదశి క్లాసుకు వెళ్లాను. మామూలు సభ్యులే కాక, నాసిక్‌నుంచీ వచ్చిన శ్రీమతి సుందరాబాయి కూడా వచ్చింది. బాబా బయటికి వెళ్లటం, తిరిగి లోనికి రావడం కూడా చూచాము. మసీదులో బాబా నాకో కథ చెప్పారు. ఆయన యవ్వనంలో ఉన్నపుడు ఒక ఉదయం బయటికి వెళ్లి ఆడపిల్లగా మారి కొన్నాళ్లు అలాగే ఉండిపోయారట. ఇంతే చెప్పారు. ఎక్కువ వివరాలివ్వలేదు. మధ్యాహ్న హారతి మామూలుగా నడిచిపోయింది. ఇవ్వేళ పూజకు చాలా మంది వచ్చారు. మధ్యాహ్న భోజనం, విశ్రాంతి తరువాత పంచదశి నడిచింది. మాధవరావు నేను అమరావతి మరలివెళ్లటం గురించి బాబాను అడిగాడు. నాకు రోజులు అనుకూలంగాలేవనీ, మరి కొన్ని నెలలు నేనిక్కడే ఉండాలనీ జవాబు వచ్చింది. మేము సాయిబాబాను సాయంత్రం నడకలోను, వాడా హారతి తరువాత దర్శించుకొన్నాము. శేజారతి తరువాత భీష్మ భాగవతం, దాస బోధ చదివాడు.

24-02-1912

కాకడహారతికి వెళ్లివచ్చాక పంచదశి చదువుకున్నాము. సాయిమహరాజు బయటికి వెళ్లేటపుడు దర్శించుకొన్నాం. తరువాత మధ్యాహ్నహారతికి మసీదుకు వెళ్లాము. అంతా మామూలుగా నడిచింది. భోజనం-విశ్రాంతి. కోపర్గావ్ మామ్లేదార్ సానే, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ నానాసాహెబ్ బెహరే బాలాసాహెబ్ భాటేతో కలిసి వచ్చి కాసేపు మాట్లాడారు. వాళ్లు వెళ్లిపోయాక మళ్లీ పంచదశి చదువుకున్నాంగానీ నత్తనడక నడిచింది. సాయిబాబాను సాయంత్రపు నడకలో దర్శించు కొన్నాం. సాయంత్రం వాడా హారతి తరువాత నాసిక్ మహిళలు భజన చేశారు. వాళ్లకు చక్కని కంఠాలున్నాయిగానీ చాలా నీరసంగా ఉన్నాయి. వాళ్ల ప్రయత్నాన్ని భరించేలాగా లేవు.

**(సశేషం)**

# జగద్గురు తత్త్వబోధక స్వామి

## - రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర

దక్షిణ దేశాన్నంతా ఏకఛత్రంగా పరిపాలించిన విద్యానగర చక్రవర్తులలో కడపటివాడు 1585-1614 మధ్య రాజ్యం చేసిన వెంకటపతి దేవరాయ మహారాయలు. ఆయన కొన్నాళ్ళు పెనుగొండను, తరువాత చంద్రగిరిని రాజధానిగా చేసుకుని దేశ పరిపాలన చేశాడు. ఆయన రాజ్యం కృష్ణానదికి దక్షిణాన కన్యాకుమారి వరకు వ్యాపించి ఉండేది. శ్రీరంగపట్నంలో ఆయన తమ్ముడి కుమారుడే రాజప్రతినిధిగా వుండి మైసూరు, కర్నాటక రాజ్యాలను పరిపాలించేవాడు. 1612లో రాజ ఒడయరు మైసూరుకు పరిపాలకుడైనాడు. బేదనూరు లేక ఇక్కేరిలో ఒక సామంత మండలేశ్వరుడుండేవాడు. ఇలాగే దక్షిణ దేశంలో తుండీరానికి జింజిలోను, పాండ్యానికి మధురలోను, చోళదేశానికి తంజావూరులోను సామంత మండలేశ్వరులు ఉండి పరిపాలించేవారు.

విజయనగర సామ్రాజ్యము నేలిన చక్రవర్తులు తెలుగువారే అయినందువల్లను, వారి కాలంలో వివిధ ప్రాంతాలను పరిపాలించిన రాజప్రతినిధులు, సామంత మండలేశ్వరులు రాజబంధువులుగానో, తెలుగు నాయకులుగానో ఉంటూ ఉన్నందువల్లను దేశ ప్రభుత్వమంతా తెలుగువారి చేతులలోనే ఉండి కన్యాకుమారి వరకూ గల దక్షిణ దేశమంతా తెలుగుమయంగా ఉండేది. ఆ కాలంలో ఈ దేశంలో ఉండిన పాశ్చాత్యులు చాలామంది యీ సంగతిని గురించి వ్రాసియున్నారు.

విజయనగర సామ్రాజ్యం బలహీనమైనకొద్దీ సామంత మండలేశ్వరులు బలవంతులై, కొంతకాలమునకు సామంత రాజులై, తరువాత స్వతంత్రులైనారు. తంజావూరు, మధురల నేలిన నాయకరాజులు చోళ పాండ్యరాజులని ప్రసిద్ధి చెందారు. వీరు కూడా విద్యానగర ప్రభువులలాగనే తెలుగు కవులను, గాయకులను, పండితులను పోషించి ప్రజాను రంజకంగా దేశాన్ని పరిపాలించారు. వీరి కాలంలో సంగీత సాహిత్యాలు, కళలు సర్వతోముఖంగా అభివృద్ధి చెంది ఇప్పటికీ వారి కీర్తిని వేనోళ్ళ చాటుతున్నవి.





వెంకటపతి దేవరాయల కాలంనాటికి కుమార కృష్ణప్ప నాయకుడనే లింగనాయకుడు మధురకు సామంత మండలేశ్వరుడుగా ఉండేవాడు. అతడు 1602లో చనిపోగా ఆయన కుమారుడు ముద్దు కృష్ణప్ప నాయకుడు 1609 వరకూ పరిపాలించారు. తరువాత ముద్దు వీరప్ప నాయకుడు 1623 వరకూ పరిపాలించాడు. వీరప్ప నాయకుడి కాలంలో వెంకటపతి దేవరాయలు చనిపోగా వీరప్ప నాయకుడు మధురకు స్వతంత్ర రాజైనాడు. ఆయన తరువాత తిరుమల నాయకుడని ప్రసిద్ధి చెందిన "మహారాజమాన్య రాజశ్రీ తిరుమలశౌరి అయ్యలుగారు" 1623లో మధుర రాజ్యానికి పట్టాభిషిక్తుడై 1659 వరకూ పరిపాలించారు.

### పోర్చుగీసు వారు - క్రైస్తవ మత ప్రచారము

మన దేశానికి వర్తకం చెయ్యడానికి మొట్టమొదట వచ్చిన ఐరోపా జాతి వారు పోర్చుగీసు వారు. వీరు మన దేశ రాజులను, వారి సామంతులను ఆశ్రయించి పశ్చిమ సముద్ర తీరంలో అక్కడక్కడ కొన్ని వర్తక స్థానాలను ఏర్పరచుకున్నారు. వర్తకులతోపాటు రోమను క్యాథలిక్కు శాఖకు చెందిన జెస్యూటులనే పోర్చుగీసు క్రైస్తవ మిషనరీలు కూడా ఇక్కడికి వచ్చి మతప్రచారం చెయ్యడం ప్రారంభించారు♦. వింత దుస్తులు ధరించి, గొడ్డు మాంసం తింటూ, మద్యపానం చేస్తూ, కులభేదాలు పాటించక మాల మాదిగలతో కలిసి మెలసి తిరిగే ఈ విజాతీయులనూ, వీరిలాగ ఉండే వారినీ మన వాళ్ళు 'పరంగీ'లని అనేవారు. పోర్చుగీసు వారు ఎక్కువగా యీ దేశంలో సముద్రతీరాన్ని ఉండే పరవరులనే

పల్లెకారులలో క్రైస్తవ మత ప్రచారం చేశారు. ఈ పరంగీలకూ, దేశీయ స్త్రీలకూ పుట్టిన సంకరజాతి ఒకటి త్వరలోనే బయలుదేరింది.

వెంకటపతి దేవరాయ మహారాయల కాలం నాటికి విజయనగర సామ్రాజ్యములో చాలాచోట్ల పోర్చుగీసువారు స్థిరపడ్డారు. మన దేశ రాజులు మొదటి నుంచి సర్వమతాల వారిని సమానంగా చూసే సహన బుద్ధి కలవారు గనుక రాయలవారు పోర్చుగీసు వారి క్రైస్తవ మత ప్రచారానికి ఆటంకాలు కలిగించకపోవడమేగాక వారి క్రైస్తవ మత ప్రచారకులైన జెస్యూటు మిషనరీ ఫాదరీలను ఆదరించి గౌరవించేవారు. క్రైస్తవ దేవాలయాలు కట్టుకోడానికి, పాఠశాలలు స్థాపించడానికి, మత ప్రచారం చెయ్యడానికి అనుజ్ఞనిచ్చేవారు.

---

♦ జెస్యూటు మిషనరీలు-సొసైటీ ఆఫ్ జీసస్ అనే రోమను క్యాథలిక్కు క్రైస్తవ మత ప్రచారక సంఘానికి చెందిన సన్యాసులు. వీరిని మన దేశీయులు 'ఫాదరీ'లనేవారు. ఈ సంఘము 1539లో స్థాపించబడి పోర్చుగల్లు స్పెయిను రాజ్యముల ఆధ్వర్యం క్రింద దేశదేశాలలో క్రైస్తవ సన్యాసుల మఠాలను స్థాపించి అతి తీవ్రమైన మతప్రచారం సాగించింది. ఈ సంఘంలో చేరిన జెస్యూటు మిషనరీలు కొంతకాలం నియమంగా మత విద్యనభ్యసించి, కాంతాకనకములను వర్జించి, బ్రహ్మచర్య వ్రత మవలంబించి, క్రైస్తవ మత ధర్మాలను త్రికరణశుద్ధిగా నాచరించే దీక్షను వహించి సన్యాసాశ్రమం స్వీకరించేవారు. ఇటలీ దేశంలో రోమను నగరంలోనున్న క్రైస్తవ మత జగద్గురువైన 'పోప్' గారి అధికారానికి లోబడి ఈ జెస్యూటుల మఠాలు పనిచేసేవి. క్రైస్తవ సంఘంలోని ప్రొటెస్టెంటులు పోపుగారి అధికారాన్ని ధిక్కరించినప్ప డీ జెస్యూటులు పోపుగారికి కుడి భుజంగా నిలిచి పనిచేశారు. ఈ సంఘము వారు బలవంతులై క్రమ క్రమంగా లౌకిక వ్యవహారాలలోనూ, రాజకీయాలలోనూ పాల్గొంటూ ధన సంపాదన కోసం వర్తక వ్యాపారాలలో ప్రవేశించినందువల్ల యీ





సంఘములో కొన్ని దురాచారాలు ప్రబలినవి. మతప్రచారంలో వీరు కొన్ని అన్యాయ పద్ధతులు కూడా అవలంబించారు.

మన దక్షిణ హిందూ దేశంలో పడమటి సముద్ర తీరాన్ని పోర్చుగీసు వర్తకుల రేవు పట్టణమైన గోవా నగరంలో జెస్యూటు మఠం ఒకటి 1542లో స్థాపించబడగా ఇక్కడ మతప్రచారం ప్రారంభమైంది.

---

చోళ మండలంలో సముద్రతీరాన్ని ఉండే పరవరులనే పల్లెకారి జనంలో చాలామందిని పోర్చుగీసు క్రైస్తవ మత ప్రచారకులు రోమను కాథలిక్కు మతంలో కలిపినందువల్ల వాళ్ళ క్షేమం కోసం నియమింప బడిన జెస్యూటు క్రైస్తవ మిషనరీ అయిన 'గొంజాలో ఫెర్నాండెజ్' అనే ఫాదరీ 1569లో మధురా నగరానికి వచ్చి అక్కడ తన నివాసం ఏర్పరచు కున్నాడు. అప్పుడు మధురరాజ్యాన్ని పరిపాలించే సామంత మండలేశ్వరు డైన కుమార కృష్ణప్ప నాయకుడు ఆ ఫాదరీని ఆదరించి మధురలో ఒక క్రైస్తవ దేవాలయం కట్టుకోవడానికి అనుజ్ఞ నిచ్చాడు. ఇలాగ పాండ్య రాజధానిలో క్రైస్తవ మత ప్రచారం చెయ్యడానికి అవకాశం ఒకటి ఏర్పడింది. ఫెర్నాండెజ్ ప్రజలతో కలిసిమెలిసి తిరిగేవాడు. ఏదో ఒక సందర్భంలో ఏసుక్రీస్తును గురించి చెప్పతూ ఉండేవాడు. ఆయన మంచి తనమూ, సద్గుణములు బ్రహ్మచర్య వ్రతమూ చాలామందిని ఆకర్షించినవి. చాలామందికి ఆయనపైన సదభిప్రాయం కలిగింది. అలా ఆయన సంగతి తెలుసుకుందామనీ, ఆయన క్రొత్తమతం సంగతి తెలుసుకుందామనీ కుతూహలంతో కొందరు బ్రాహ్మణులు కూడా ఆయన దగ్గరకు వచ్చి మాట్లాడుతూ ఉండేవారు. ఆయన యింటి దగ్గర మతధర్మాలను గురించిన శాస్త్ర చర్చలు తరచుగా జరుగుతూ ఉండేవి. ఈ జెస్యూటు మత ప్రచారకుడు త్వరలోనే ఒక ఆసుపత్రిని స్థాపించి అక్కడ క్రైస్తవులకే గాక ఇతరులకు కూడా మంచి మందులిచ్చి చికిత్సలు చేసేవాడు.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

అక్టోబరు మూడవ వారం అంతా శ్రీ సాయి విద్యాధామంలో పరీక్షల హడావుడి, అటుపైన ఒక వారం రోజులపాటు వివిధ రకాల పోటీల నిర్వహణ వగైరాలతో గడిచిపోయింది. 17వ తేదీన పాఠశాల ప్రాంగణం విద్యార్థినులంతా శుభ్రం చేసి, కళ్లాపులు చల్లి, రంగవల్లులు దిద్దారు. వన్నెవన్నెల పూలతో ఒక్కొక్క తరగతి పిల్లలు ఒక్కొక్క బ్రతుకమ్మను తయారుచేసుకొని ముగ్గుల మధ్య ఉంచారు. ప్రసాదాలు కూడా తెచ్చారు. ఆడపిల్లలు అందరూ ఎంచక్కా పరికిణీ ఓణీల్లో వచ్చారేమో ముద్దుగా కన్పిస్తున్నారు. రెండు మూడు దళాలుగా విడిపోయి దళం తరువాత దళంగా చక్కని పాటలతో నాట్యం చేసారు - యు.కె.జి నుంచీ పదో తరగతి పిల్లల వరకు. చివరిలో బ్రతుకమ్మలన్నీ చెరువులో కలిపి, ప్రసాదాలు పంచారు.

గురుదేవుల సమాధి చెంత ధ్యాన మందిర నిర్మాణానికి శంకుస్థాపన విజయదశమి (22-10-2015)నాడు చేయాలని ముందే నిర్ణయించుకోవటం జరిగిందని పాఠకలోకమంతటికీ తెలుసు. ఆనాటి ఉదయం పది గంటలకు శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ సభ్యులు, కొంతమంది ముఖ్య సభ్యులు వచ్చేసారు. ముందరిరోజే బ్రహ్మారెడ్డి, ముత్యాలు మొదలైన వారంతా కలిసి శ్రీ రవీంద్రరావు (ఇంజనీర్)గారు ముగ్గు పోయించిన దాన్ని అనుసరించి ఈశాన్యదిశలో శంకుస్థాపనకై గొయ్యి తవ్వించి ఉంచారు. గురుదేవులు లేకుండా ఆశ్రమంలో జరుగుతున్న తొలి నిర్మాణ కార్యక్రమం యిది. పైకి అందరూ మామూలుగా ఉన్నప్పటికీ గుండెలు భారమై కళ్లు చెమర్చుతూనే ఉన్నాయి. మొదట రాము సాయినాథ పూజా కార్యక్రమం మంటపం పెట్టి చేసాక, కార్యక్రమం ప్రారంభమైంది.





గురుదేవులు కళ్లజోడులోంచీ చూస్తూనే ఉన్నారు-ఎలా నిర్వహిస్తారోనని. ప్రతిసారీ శంకుస్థాపన గురుదేవుల చేత్తోనే జరిగేది. ముఖ్యంగా ఐదేళ్లుగా మాతాజీ క్రిందకు దిగటానికి యిబ్బందిపడతారని గురుదేవులు వద్దనేవారు. పునాది తొలి రాళ్లను బయటనే పూజించి యిమ్మనేవారు. కానీ, ఇవ్వేళ ఆ దయామయులు లేరు. మాతాజీ ఆరడుగుల గోతిలోకి దిగారు గురుసంస్మరణతో. సరిగ్గా సమయానికి షిరిడీ నుండీ ప్రసాదం తెచ్చారెవరో. ఇకనేం! బాబా ఆశీస్సు దొరికింది. యథావిధిగా శిలాపూజ, నవధాన్యాలు, నవరత్నాలు స్థాపించటం, శంకుస్థాపన, క్షీరాభిషేకం, శిలాన్యాసం అన్నీ విధివిధానంతో జరిగాయి. ఆహూతులు, అనుకోకుండా వచ్చిన ఆప్తులు-అందరూ అక్షతలు, నవధాన్యాలు చల్లి, కొబ్బరికాయలు కొట్టారు. మెల్లమెల్లగా పైకి పాకి వచ్చారందరూ. అటుపైన మాతాజీ గురుదేవులను సంస్మరించి, భక్తులనుద్దేశించి యిలా మాట్లాడారు -

"శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు సినిమాలంటే చికాకుపడేవారు. ఆయన "దో ఆంఖేఁ బారాహాథ్" అనే శాంతారాం సినిమా ముప్పైసార్లకు పైగా చూచారట. మన గురుదేవులకు కూడా ఆ చిత్రం చాలా యిష్టం. ఎందుకు?

అందులో ఆజీవ శిక్షపడిన ఆరుగురు పరమ భయంకర నేరస్థులైన ఖైదీలను ప్రేమతో సంస్కరించాలని సంకల్పిస్తాడు ఒక జైలరు. ఆ పనికి తన ఉద్యోగాన్నీ, ప్రాణాన్నీ కూడా పణంగా పెట్టి ప్రయత్నిస్తాడు. వారిలో ఉన్న క్రూరత్వాన్నీ, శక్తినీ, బండచాకిరినీ శ్రమశక్తిగా మలుస్తాడు. వారిలోని స్త్రీలోలతను సంయమనంగా మారుస్తాడు. వారి తిరస్కారాన్ని సహనంతో భరిస్తాడు. వారిలో నిద్రాణమై ఉన్న సున్నిత భావాలకు మెలకువ తెస్తాడు. కష్టసహిష్ణుత, ఆత్మార్పణ తన ప్రవర్తన ద్వారా నేర్పుతాడు. చివరికి తన కళ్లు నిరంతరం వాళ్లను గమనిస్తూ ఉంటాయన్న స్పృహ కలిగించి మంచి మనుషులుగా మార్చి, వారి శిక్ష రద్దయ్యేలా చేస్తాడు. ఇవన్నీ గురువులు

చేయవలసిన పనులు. గొప్ప మార్మికతతో అద్భుత సందేశంతో వెలువడిన పాతకాలపు సినిమా అది. గురుదేవులు దాన్ని ఎంతో యిష్టపడే వారందుకే.

మనందరికీ యావజ్జీవ కారాగార శిక్ష మరణకాలం దాకా పడే ఉంది. గురువులు మనలను చేరదీసి మనలోని కామాన్నీ, క్రోధాన్నీ, భేదభావాలనూ క్రమక్రమంగా తొలగిస్తారు. మనను నిరంతరం కనిపెట్టి ఉండే పరమాత్మ ఉన్నారన్న నిత్య స్పృహ మనలో కలిగిస్తారు. వారు మనను సంసారపంకిలంలో నుంచీ, స్వార్థమయ జీవితాల నుండీ ఉద్ధరించ డానికి తమ మనస్సులను, జీవితాలనే త్యాగం చేస్తారు. వారు మన కళ్ల ముందు నుండీ నిష్క్రమించినాగానీ వారి దృష్టి, వారి ప్రేమ మనను విడిచిపోవు. ఆ స్పృహ, స్ఫురణ మనలో ఉండాలి. సద్గురువుల, యతీశ్వరుల శక్తి వారి సమాధుల దగ్గర, వారు జీవించి నడియాడిన చోట్ల నిక్షిప్తమై ఉంటుంది. అవి సమాధులు కావు-సజీవ శక్తి కేంద్రాలు. రాఘవేంద్ర స్వామి, రమణ మహర్షి, అరవిందులు వగైరా మహానుభావుల విషయంలో యిది ఋజువైంది. ఇక మన సాయినాథుల వారి శక్తి వారి నిర్యాణం తర్వాత సర్వే సర్వత్రా వ్యాపించిన విషయం మనందరికీ అనుభవంలో ఉన్నదే. అందుచేత మనం యితర వ్యాపకాలు, చింతలు అన్నీ మరచి, వారి సన్నిధానంలో కూర్చొని, వారిని ధ్యానించి ఆ శక్తిని ఆవాహన చేసుకోవడానికి వీలుగా పరమపూజ్య గురుదేవులు శయనించిన చోట యీ ధ్యానమందిర నిర్మాణం చేసుకొంటున్నాం. దీనికి శ్రీ సాయి ఆశీస్సులున్నాయనడానికి సరిగ్గా సమయానికి ప్రసాదం రావటం ఒక నిదర్శనమైతే-అయా చితంగానే గురుదేవుల విగ్రహానికి తాము పూనుకొంటామని ఒక అదృష్టశాలి ముందుకు రావటం మరో నిదర్శనం.

దీనిని వచ్చే గురుపూర్ణిమ నాటికి-గురుదేవుల ద్వితీయ మండలా రాధన సమయానికి పూర్తి చేయాలన్నది శ్రీ సాయినాథులిచ్చిన సంకల్పం. "ఎవరికి ఏ స్ఫూర్తి కలిగించి ఆ సంకల్పం పరిపూర్ణం చేస్తారో వారికే





తెలుసు. పరమపూజ్య గురుదేవుల ఆశీఃపుష్పాలు మీ అందరిపై కురియుగాక!"

తరువాత చి॥ రాంబాబు మాట్లాడుతూ తాను గురుదేవుల ముందు ఇటుకరాతి కోసం బాబాగారు విచారించటం వెనుక ఉన్న రహస్యం గురించి ప్రస్తావించిన సందర్భం గుర్తు చేసుకున్నాడు. "శ్రీ సాయి మీదికి అసూయపరులు విసిరిన యిటుకకు అడ్డు వచ్చి సాయి గురుదేవులు ఆ దెబ్బ తిన్నారనీ, ఆ సమయంలో వారి రక్తం దానికి అంటిందనీ, అందుచేత అది పవిత్రమైందనీ, స్వయంగా తమ గురుదేవులే తమకది ప్రసాదించారనీ సాయే స్వయంగా చెప్పారు. ఆ యిటుక దూరమైతే తమ గురువు ఆశీస్సు దూరమైపోయినట్లూ, తమ సహచరుడు తనను విడనాడి పోయినట్లూ సాయి బాధపడటంలోని ఆంతర్యం అదే"-అని గురుదేవులు చెప్పారు. అలాంటిది మనందరం క్షణక్షణం, దినదినం కష్టాలలో, సుఖాలలో, ఆనందాలలో, ఉద్వేగాలలో ప్రతి దానిలోనూ వారితోనే, వారి సమక్షంలోనే బ్రతికాం. అందుకే వారికి దూరంగా బ్రతకటం అత్యంత దుఃఖకరంగా ఉంది. కానీ, వారి భౌతిక శరీరం దూరమైనా వారి శక్తిని అనుభూతి చెందగలిగేవారికి ఆ సాన్నిధ్యం లభిస్తుంది. ఆ భాగ్యం పొందేందుకే యీ నిర్మాణం" అని చెప్పాడు. అభిమానులు కొందరు తమ సేవ గురించి చెప్పటంతో సభ ముగిసింది. అటుపైన అందరూ భోజనాలు చేసి సెలవు తీసుకున్నారు.

అక్టోబరు 25వ తేదీన శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ బోర్డు మెంబరైన శ్రీ అరవిందాక్షన్ నాయర్‌గారు తాము తమ కంపెనీ కోసం కట్టుకొన్న క్రొత్త యింటికి ప్రారంభోత్సవం చేసుకున్న సందర్భంగా ఆశ్రమవాసులం, పిల్లలం కలిసి వెళ్లిరావటంతో గడిచింది.

అక్టోబరు 31వ తేదీనాడు శ్రీ సాయీ సేవా సమితికి బహుకాల బంధువులు, ఆప్తులు శ్రీ రవీంద్రరెడ్డిగారి షష్టిపూర్తి ఉత్సవం శాస్త్రోక్తంగా

జరిగింది. వారింట శ్రీ రెడ్డి గారికి ఆయుష్యహోమం జరిగింది. ఆ ఉత్సవానికి హాజరైన శ్రీ ఆనందంగారు, చంద్రారెడ్డిగారు, రాంబాబు, శ్రీమతి ఇందిర గారికీ, శ్రీ రెడ్డిగారికీ శ్రీ సాయి ప్రసాదంగా ఆవు నెయ్యి, నూతన వస్త్రాలు అందజేసి, షడ్రసోపేత భోజనాలు ఆరగించి వచ్చారు. ఆ రోజు ఆశ్రమ భిక్ష కూడా రవీంద్రరెడ్డి దంపతుల పేరిట ఏర్పాటైంది.

నవంబరు ఒకటి-ఆ ముందరి రాత్రి సాయినాథ క్షేత్రం నుంచీ రామ కోటేశ్వర్రావుగారు, సాయి రమణ ఆయన భార్య ఉమామహేశ్వరి వచ్చారు. సాయిరమణ నవజాత శిశువుకు గురుదేవుల పేరు పెట్టుకోవాలని రామ కోటేశ్వర్రావుగారు (తాతగారు) నిర్ణయించారు. తమ గురువుగారి పేరు పెట్టుకొంటున్నారన్న సంతోషంతో శ్రీ లక్ష్మణరావుగారు, ముసునూరి రామ్మోహనరావు దంపతులు, సాయిమాల-ప్రేమ్‌చందర్ దంపతులు, ధనలక్ష్మి లలిత, సత్యనారాయణ, బ్రహ్మారెడ్డి కుటుంబం, శ్రీ నాగేశ్వరరావుగారి కుటుంబం, శివప్రసాద్‌గారు, జ్యోతి టీచర్-వగైరాలంతా వచ్చేసారు. రమణ దంపతులు గురుదేవుల చిత్రపటం ముందు కూర్చొని తమ చిరంజీవికి "సాయి ప్రభుజీ" అని నామకరణం చేసుకున్నారు. "మా గురువుగారి పేరు పెట్టారు. వాడిని ఆ మాటా ఈమాటా అని తిట్టారంటే ఊరుకోము-మీ యిష్టం" అన్నాడు రాంబాబు. అరిసెలు, లడ్డులు, గోంగూరలాంటి అచ్చమైన తెలుగింటి భోజనం వడ్డించారు సాయినాథ క్షేత్రం తరపున ఆ రోజు. గురుదేవులను, వారి గొప్పదనాన్ని స్మరించుకోవటంతో ఆనందంగా గడిచింది ఆ రోజు.

నవంబరు 3వ తేదీ రాత్రి శ్రీ హనుమంతరావుగారు, శ్రీమతి రామ సీతగారలు వారి యింట్లో జరిగిన సత్సంగ కార్యక్రమానికి ఆహ్వానించడంతో మాతాజీ, రాంబాబు, ఆనందంగారు, చంద్రారెడ్డి పిల్లలతో సహా హాజరయ్యారు. భజన పూర్తి అయిన తరువాత శ్రీమతి రామసీతగారి కోరికపై మాతాజీ ఐదు నిముషాలపాటు శ్రీ సాయీ సచ్చరిత్ర నుండి





హాజీ సిద్ధిఖీ ఫాల్కే గురించి వివరించారు. "బాబా హాజీని బారవీ బావి దగ్గరి యిరుకు సందులోకి రాగలడేమో కనుక్కోమ్మన్నారు. హాజీ వస్తానన్నాడు. 'నలభై వేలివ్వగలవా?' అంటే నాలుగు లక్షలైనా యిస్తానన్నాడు. మేకను కోస్తే ఏ భాగం కావాలని అడిగారు. హాజీ బాబా భిక్షా పాత్రలోని ఏ చిన్న ముక్క యిచ్చినా చాలునన్నాడు. అటుపై బాబా చాలా కోపించి హాజీ మీద విరుచుకు పడ్డారు. గర్వంతో తననే కనుగొనలేకపోతున్నాడని నిందించారు. హాజీ భయపడ్డాడు. అప్పుడు బాబా అతనిపై దయతలచి పండ్లు పంపి, ఆనాటి నుంచీ చేరువ చేసుకున్నారు.

ఇది మనకు గొప్ప సందేశాన్నిచ్చే కథ. సాధకునిలో జ్ఞానాహంకారం ప్రవేశిస్తే అతన్ని రక్షించగలవారెవరూ ఉండరు. తనకు తానే ఆలోచించుకొని, ఆ ప్రమాదంలో నుండీ బయటపడగలగాలి. అందుకు సాయి సహాయం చెయ్యదలచుకొన్నారు. ఆధ్యాత్మిక సంపత్తి పొందటం చాలా శ్రమతో కూడుకొన్న పని అనీ, దానికి రాచబాటలేవీ ఉండవనీ, ఎలాగో యిరుకులను (ఇబ్బందులను) సహిస్తూ ముందుకు సాగిపోవాలనీ తొలి ప్రశ్న ద్వారా సూచించారు. రెండవ ప్రశ్న ద్వారా హాజీ ధనకాంక్షను (ఐహిక సంపదను) త్యజించగలడా-అని అడిగారు. మూడవ ప్రశ్నలో కామనలు (కోరికలు) విడిచిపెట్టగలవా- అని అడిగారు. ఇచ్చిన దానితో తృప్తిపడతాననీ-ఇదీ, అదీ అని కోరననీ అన్నాడు హాజీ. అతడు జవాబులన్నీ సరిగానే యిచ్చాడుగానీ, ఆంతర్యంలో ఎక్కడో ఒకానొక అహంకారపు ముల్లు తొంగి చూస్తున్నది. బాబా ప్రశ్నలు తాను సరిగా అర్థం చేసుకొని, చక్కగా సమాధానాలు చెప్పగలిగానన్న జ్ఞానాహంకారం అతనిలో తలఎత్తింది. బాబా దాన్ని తన కోపంతో ఎత్తిచూపి అతన్ని క్షాళనం చేసారు.

దీని ద్వారా మనం నేర్చుకోవలసినది ఎంతో ఉన్నది. నిత్యం సత్సంగాలలో, అప్పుడప్పుడూ సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటాము. లౌకిక వ్యవహారాలలో తలమునకలయ్యే వారికి విభిన్నంగా ఏదో ఒక సన్మార్గంలో

నడుస్తున్నామన్న తృప్తి ఉంటుంది. అది క్రమంగా అహంగా మారే అవకాశాలుంటాయి. 'మాకేమీ అలా లేదు' అనుకొంటాం. కానీ, తనను తాను గుర్తెరుగగలవాడు పరబ్రహ్మ స్వరూపమే అని పెద్దలన్నారు. మనలో తలెత్తే ఆ మాయ పరమ చలాకీది. దాన్ని పట్టుకోలేము. భవనం పై అంతస్తుకు ఎక్కడానికి మెట్లుంటాయి. ఆ మెట్లు సిమెంటు, ఇసుకతోనే కడతారు, భవంతినీ వాటితోనే కడతారు. రెండింటి మూలపదార్థం ఒకటే గనుక మెట్ల మీదే కూర్చోము గదా!' అవి పైకి వెళ్లడానికి ఉపకరకాలు మాత్రమే నన్న స్పృహ మనలో ఉండాలి. భజనలు, సత్సంగాలు ఐక్యతను పెంచుతాయి. ఆనందాన్నిస్తాయి. కానీ, అవి పరాకాష్ఠ కాదు-తొలి మెట్లు. అటుపైన మనను కమ్మే మాయలను, అడ్డుకొనే విఘ్నాలను ఛేదించుకొని శ్రమించి ఇరుకు త్రోవన నడవాలి. లౌకిక కామనలను, ధనకాంక్షను (కామినీ, కాంచనాలను) త్రోసి రాజనగలగాలి. అప్పటికిగానీ మోక్ష సామ్రాజ్య ద్వారం దగ్గరకు చేరుకోలేము. ఎంతో సాధన, దీక్ష, త్యాగం ఉంటేగానీ అది సాధించలేము. అదే యీ కథ ద్వారా సాయి మనకు చెప్పినది. మా గురుదేవులు పదేపదే దీనిని గుర్తు చేస్తుండేవారు. మనం కూడా గుర్తుంచుకొని ధన్యులమవుదాం". తమ సహజ సరళశైలిలో మాతాజీ చెప్పిన పై విషయాలు భక్తులు శ్రద్ధగా ఆలకించారు.

దీపావళి నాటి సాయంత్రం దేవాలయంలో లక్ష్మీపూజ, మా పరమ గురువులు (గురుదేవుల గురువులు) శ్రీశ్రీశ్రీ మాణిక్యరాయ శర్మగారి సంస్మరణ పూజ జరిగాయి.

నవంబరు 14వ తేదీన శ్రీ సాయి విద్యాధామంలో "బాల కవి సమ్మేళనం" జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యపఠనం, వ్యాస రచన పోటీలు గతంలోనే జరిగాయి. విజేతల పేర్లు ఆ రోజు ప్రకటించారు. అమ్మ, దేశం, భూమి, సాగరం, నా ఆదర్శం, ప్రకృతి, నది, మనిషి-మానవుడు అనే వివిధ విషయాలపైన వేరువేరు దళాలకు పోటీ (అరగంట





ముందు విషయం చెప్పి) నిర్వహించారు. ఇంత వరకు అలాటివి అట్టే అలవాటు లేకపోయినప్పటికీ పిల్లలందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని వ్రాసారు. వాళ్ల చిన్ని, చిట్టి బుర్రల్లో ఎన్నెన్ని భావాలో! వాళ్లకు వచ్చిన భాషలోనే ఎంతో బలమైన భావాలను ముచ్చటగా చెప్పారు. మనిషికి ఆదర్శం ఉండాలా? అన్న విషయం మీద వ్రాసిన వ్యాసాలలో కూడా ఎంతో వైవిధ్యం కనబరిచారు. టీచర్లు కూడా కవి సమ్మేళనంలో తమ గళాలు వినిపించటం ముదావహం.

# సాయినాథాయ తే నమః

1. ఓం నమః పరమతత్వాయ, శాశ్వతాయ మహోత్మనే ।
   శిరిడీ గ్రామ వాసాయ, సాయినాథాయ తేనమః ॥
2. విశ్వరూపాయ విశ్వాయ, విశ్వాధారాయ తేజసే ।
   సర్వ ధర్మ విలాసాయ, సాయినాథాయ తేనమః ॥
3. అవ్యయాయ విశేషాయ, సచ్చిదానంద రూపిణే ।
   శాంతాయ పరిపూర్ణాయ, సాయినాథాయ తేనమః ॥
4. నిర్వికల్పాయ దాంతాయ, పూజ్యాయ పరిమేష్ఠినే ।
   పూర్ణ బ్రహ్మావతారాయ, సాయినాథాయ తేనమః ॥
5. సగుణాయ నిరీహాయ, కమనీయ స్వరూపిణే ।
   భక్త బృందైక వంద్యాయ, సాయినాథాయ తేనమః ॥
6. ఆజానుబాహుం, నిజభక్త పాలనం
   పాషాణ వాసం, విమలం, కృపాఘనం ।
   సర్వోత్తమం శ్రీ షిరిడీ నివాసం
   శ్రీ సాయినాథం శరణం ప్రపద్యే ॥